సాక్షి
నిర్మల్
గురువారం । 30 । నవంబర్ । 2023



ఆ పోలింగ్ కేంద్రాలపై డేగ కన్ను !
మావోయిస్టు ప్రభావితమైన పోలింగ్ కేంద్రాలపై భద్రతా బలగాలు ప్రత్యేక దృష్టి సారించాయి. మావోయిస్టుల కార్యకలాపాలు తగ్గినా ఎన్నికల వేళ పోలీసులు అప్రమత్తమయ్యారు. 8లో▸



భైంసాలో సోదాల కలకలం
భైంసా పట్టణంలోని బీజేపీ అభ్యర్థి బంధువు ఇంట్లో మంగళవారం అర్ధరాత్రి పోలీసులు, ఎన్నికల అధికారులు సోదాలు చేశారు. దీంతో ఆ ప్రాంతంలో కలకలం రేగింది. 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
31.3 /20.2
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. అల్పపీడనం ప్రభావంతో ఒకటిరెండు చోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

రండి.. ఓటేద్దాం!



అమూల్యమైన ఓటు కోసం...



ఈ ఫొటోలోని యువకుడి పేరు జనతా నవీన్‌కుమార్. సోన్ మండలం కూచన్‌పల్లికి చెందిన మాజీ సర్పంచ్ జనతా మల్లయ్య కుమారుడు. ఉపాధి కోసం కొన్నేళ్లుగా దుబాయ్ వెళ్తున్నాడు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతోనే ఈసారి ఎలాగైనా ఓటేయాలని నిర్ణయించుకున్నాడు. దీంతో తాను పనిచేస్తున్న సంస్థను సెలవు కోరాడు. సంస్థ సెలవు మంజూరు చేయడంతో ఓటు వేసేందుకు బుధవారం స్వగ్రామానికి చేరుకున్నాడు. ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు విలువైందని, పవిత్రమైన ఓటు వేసేందుకు దుబాయ్ నుంచి వచ్చానని నవీన్‌కుమార్ వెల్లడించాడు. – సోన్



ఈ ఫొటోలోని వృద్ధురాలి పేరు అన్నపూర్ణబాయి. వయసు 104 ఏళ్లు. భైంసాకు చెందిన అన్నపూర్ణబాయి నడవలేని స్థితిలో ఉన్నా.. ఇటీవలే ఎన్నికల సంఘం కల్పించిన సౌకర్యం మేరకు 12డి ఫాంతో దరఖాస్తు చేసుకుని ఇంటి వద్ద ఓటుహక్కు వినియోగించుకుంది. యువత, మధ్యవయసు వారు కూడా తప్పకుండా ఓటు వేయాలని సూచిస్తోంది. ఓటు వేయనివారు ప్రశ్నించే హక్కు కోల్పోతారని అంటోంది. – భైంసాటౌన్

- నేడే.. పోలింగ్‌డే
- గత ఎన్నికల్లో 80.7 శాతం పోలింగ్
- ఈసారి వందశాతం లక్ష్యం
- ఆ దిశగా అధికారుల ఏర్పాట్లు పూర్తి

నిర్మల్: ఎదురుచూస్తున్న ఎన్నికల తరుణం రానేవచ్చింది. శాసనసభలో అడుగుపెట్టాలనుకుంటున్న అభ్యర్థుల తలరాతను ఓటర్ తేల్చే సమయమిది. జిల్లావ్యాప్తంగా గురువారం పోలింగ్ నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఇందుకు సంబంధించి బుధవారం సాయంత్రానికే పోలింగ్ అధికారులు, సిబ్బందికి పూర్తి సామగ్రిని అందించి, ప్రత్యేక వాహనాల్లో పంపించారు. వారంతా తమకు కేటాయించిన కేంద్రాలకు చేరుకున్నారు. రోజంతా ఎన్నికను సజావుగా నిర్వహించేందుకు అన్నీ సిద్ధం చేసుకున్నారు. ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ ప్రక్రియ మొదలుకానుంది. అంతకుముందే మాక్ పోలింగ్ ప్రక్రియను సిబ్బంది పూర్తి చేసుకోనున్నారు. సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగనుంది.

7,23,389 మంది ఓటెత్తాలె..
జిల్లాలో నిర్మల్, ముధోల్‌తోపాటు ఖానాపూర్ నియోజకవర్గాలు ఉన్నాయి. మూడు నియోజకవర్గాలు కలిపి 7,23,389 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళలు 3,72,829, పురుషులు 3,50,509, ఇతరులు 51మంది ఉన్నారు.

- నిర్మల్ నియోజకవర్గంలో మొత్తం 2,53,309మంది ఓటర్లు ఉండగా, మహిళలు 1,32,925మంది, పురుషులు 1,20,365 మంది, ఇతరులు 19 మంది ఉన్నారు.
- ముధోల్ నియోజకవర్గంలో 2,49,554 మంది ఓటర్లు ఉన్నారు. మహిళలు 1,27,792, పురుషులు 1,21,744 మంది, ఇతరులు 18 మంది ఉన్నారు.
- ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గమైన ఖానాపూర్‌కు సంబంధించి జిల్లాలో ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాలతోపాటు ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్, ఇంద్రవెల్లి, సిరికొండ, మంచిర్యాల జిల్లాలోని జన్నారం మండలాలు ఉంటాయి. ఈ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,20,526 మంది ఉన్నారు. మహిళలు 1,12,112 మంది, పురుషులు 1,08,400 మంది, ఇతరులు 14మంది ఉన్నారు.

వెనుకబడుతున్న పట్నం..
జిల్లాలో 2014, 2018లలో జరిగిన ఎన్నికలను పరిశీలిస్తే.. పట్టణవాసులకన్నా గ్రామీణ ఓటర్లే చైతన్యవంతంగా ఓటు వేసినట్లు స్పష్టమవుతోంది. 2014 ఎన్నికల్లో 74 శాతం, 2018లో 80.7 శాతం పోలింగ్ నమోదైంది. ఇందులో పట్టణ ఓటర్లశాతం 45–55 శాతం ఉండగా, పల్లె ఓటర్లు 75–95 శాతం ఓటుహక్కును వినియోగించుకున్నారు. విద్యావంతులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారులు అధికంగా ఉండే పట్టణ ప్రాంతాల్లోనే పోలింగ్ శాతం తక్కువగా ఉండటం గమనార్హం. పట్టణాల్లోనూ పేద, మధ్య తరగతి కుటుంబాల ఓటర్లు వంద శాతం ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తేలుతోంది. అక్షరాస్యత ఎక్కువగా ఉండే ఎగువ మధ్యతరగతి, ఉన్నత వర్గాల ఓటర్లే ఓటుహక్కును ఎక్కువగా వినియోగించుకోవడానికి ముందుకు రాలేదన్న విషయం విస్మయం కలిగిస్తోంది. జిల్లా అధికారులు ఈసారి కూడా ఓటుహక్కు వినియోగించుకోవాలంటూ విస్తృతంగా ప్రచారం చేశారు.

వందశాతం లక్ష్యంతో...
స్మార్ట్ ఫోన్ల యుగంగా పేరున్న ఈ కాలపు ఎన్నికల్లో వందశాతం ఓటింగ్ నమోదు కావాలి. ఈ నేపథ్యంలోనే జిల్లా అధికారులూ వందశాతం ఓటింగ్ లక్ష్యంగా నిర్ణయించారు. ఈ మేరకు జిల్లాలో స్వీప్ ద్వారా అవగాహన సదస్సులు, ర్యాలీలు, మార్నింగ్ వాక్, రన్‌లు, బతుకమ్మ ఆటలు, కళాజాత బృందాల ద్వారా చైతన్య పరిచే కార్యక్రమాలను నిర్వహించారు. దివ్యాంగులు, వృద్ధులు, గర్భిణులు, బాలింతల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దివ్యాంగులకు, నడవలేని పరిస్థితిలో ఉన్న వారికి పోలింగ్ కేంద్రం ద్వారా వాహన సౌకర్యం, వీల్ చైర్లను అందుబాటులో ఉంచారు.

ఓటింగ్ పెరగాలె..
గత 2018 ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. గత ఎన్నికల్లో మొత్తం 6,21,456 మంది ఓటర్లు ఉండగా, ఈసారి 7,23,389 మంది ఉన్నారు. ఐదేళ్ల కాలంలో జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో కలిపి 1,01,933 మంది ఓటర్లు పెరిగారు. ఈలెక్కన ఓటింగ్‌శాతం కూడా భారీగా పెరగాల్సిన అవసరం ఉంది. గత ఎన్నికలతో పోలిస్తే ఈ ఐదేళ్లకాలంలో చైతన్యవంతమైన మార్పులు వచ్చాయి. ఈ క్రమంలో ప్రతి ఒక్కరికీ పోలింగ్ ప్రక్రియపైనా అవగాహన ఏర్పడింది. ఈ క్రమంలో ప్రతీ ఓటర్ పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేసి, తన బాధ్యత నెర్చవేర్చుకోవాల్సిన అవసరం ఉంది. స్థానికులు కానప్పటికీ ఓటర్లకు స్ఫూర్తినిచ్చేలా చాలామంది జిల్లా ఉన్నతాధికారులు జిల్లాలోనే ఓటు వేస్తున్నారు. ఈ మేరకు జిల్లా ఓటర్లు కూడా వందశాతం ఓటు హక్కును వినియోగించుకోవాలని వారు పిలుపునిస్తున్నారు.

అందరూ ఓటేయాలి..



జిల్లా ఓటర్లందరూ గురువారం కచ్చితంగా ఓటుహక్కు వినియోగించుకోవాలి. ప్రతీ ఓటర్ తమ బాధ్యతగా వచ్చి ఓటు వేస్తేనే ప్రజాస్వామ్యానికి విలువ పెరుగుతుంది. హాలిడేలా కాకుండా పోలింగ్‌డేను ఓ పండుగలా చూడాలి, కచ్చితంగా ప్రతీ ఒక్కరు ఓటువేయాలి.
– ఆశిష్ సంగ్వాన్, కలెక్టర్

ఓటర్ల వివరాలు...	
మొత్తం ఓటర్లు	7,23,389
పురుషులు	3,50,509
మహిళలు	3,72,829
ఇతరులు	51

పోలింగ్ కేంద్రాలు..

మొత్తం పోలింగ్ కేంద్రాలు (నిర్మల్-306, ముధోల్-312, ఖానాపూర్-305)	923
సమస్యాత్మక కేంద్రాలు	153
మావోయిస్టు ప్రభావిత కేంద్రాలు	17
మహిళ పోలింగ్ కేంద్రాలు	15
దివ్యాంగుల పోలింగ్ కేంద్రాలు	03
యువత పోలింగ్ కేంద్రాలు	03

ఈవీఎంల వివరాలు..

కంట్రోల్ యూనిట్లు	1,151
బ్యాలెట్ యూనిట్లు	1,454
వీవీప్యాట్లు	1,290
మొత్తం	3,895

ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న అధికారులు, సిబ్బంది

జిల్లా ఎన్నికల అధికారి	01
జిల్లా సహాయ ఎన్నికల అధికారి	01
రిటర్నింగ్ అధికారులు	03
సహాయ రిటర్నింగ్ అధికారులు	03
ప్రిసైడింగ్ అధికారులు	923
రిజర్వు పీఓలు	187
అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు	923
రిజర్వు ఏపీఓలు	374

నియోజకవర్గాల వారీగా అధికారులు..
(నిర్మల్-1,468, ముధోల్-1,496, ఖానాపూర్-604)

పోటీచేసే అభ్యర్థుల సంఖ్య..
(నిర్మల్-13, ముధోల్-14, ఖానాపూర్-11)

పోలింగ్‌కు సిద్ధం

జంగ్ తెలంగాణ



ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు బయల్దేరిన సిబ్బంది

- నేడు అసెంబ్లీ ఎన్నికల పోలింగ్
- ఉదయం 7 గంటలకే షురూ..
- పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది కేటాయింపు
- సామగ్రితో తరలివెళ్లిన పోలింగ్ సిబ్బంది
- రాత్రి వరకు చేరుకుని.. ఏర్పాట్లలో నిమగ్నం



కేంద్రాలకు తరలుతున్న మహిళా సిబ్బంది

నిర్మల్: పోలింగ్ ఏర్పాట్లలో భాగంగా బుధవారం జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాల్లో అధికారులు, సిబ్బందికి సామగ్రిని అప్పగించారు. నిర్మల్, ముధోల్ నియోజకవర్గాలకు సంబంధించి రిటర్నింగ్ అధికారులు ఉన్న నియోజకవర్గ కేంద్రాల్లోనే పంపిణీ చేపట్టారు. ఖానాపూర్ నియోజకవర్గానికి సంబంధించి రిటర్నింగ్ అధికారి ఉట్నూరులో ఉన్నందున అక్కడే పోలింగ్ సామగ్రిని అప్పగించారు.

రోజంతా సందడి..
ఎన్నికల విధులు ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులందరూ సామగ్రితో పంపిణీ కేంద్రాలకు వచ్చారు. రిటర్నింగ్ అధికారుల పర్యవేక్షణలో వారికి పోలింగ్ కేంద్రాలను కేటాయించారు. ఎన్నిక నిర్వహణకు కావాల్సిన ఈవీఎంలు, వీవీప్యాట్లు, కంపార్ట్‌మెంట్లు, ఇంక్ తదితర సామగ్రిని అప్పగించారు. వివిధ రూట్లలో ఉన్న పోలింగ్ కేంద్రాలకు ఆయా రూట్ల వారీగా బస్సులను ఏర్పాటు చేసి సిబ్బందిని చేరవేశారు. రాత్రి 8గంటల లోపు దాదాపుగా సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. అక్కడక్కడ కొన్నికేంద్రాల్లో సరైన సదుపాయాలు లేకున్నా.. ఒక్కరోజుకు ఎలాగోలా గడిపేస్తామని సిబ్బంది పేర్కొన్నారు.

కలెక్టర్ పరిశీలన..
పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాలను కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ పరిశీలించారు. నిర్మల్‌లోని ఎన్టీఆర్ మినీస్టేడియంలో ఏర్పాటుచేసిన పంపిణీ కేంద్రాన్ని, తర్వాత ముధోల్, ఉట్నూర్‌లోని పంపిణీ కేంద్రాలను పరిశీలించారు. ఎన్నికలను సజావుగా నిర్వహించాలని, ప్రతీఒక్కరూ పకడ్బందీగా ఉండాలని సూచించారు.

వెబ్‌కాస్టింగ్..
జిల్లాలోని మొత్తం 923 కేంద్రాలకుగానూ 603 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ చేపడుతున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా కెమెరాలను ఏర్పాటు చేశారు. గత ఎన్నికల వరకు బాసర ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల సేవలను సద్వినియోగం చేసుకున్నారు. ఈసారి రాష్ట్రవ్యాప్తంగా ఏజెన్సీకి వెబ్‌కాస్టింగ్ నిర్వహణ అప్పగించినట్లు తెలిసింది.



నిర్మల్‌లోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో పీవోలు, ఏపీవోలు, ఎన్నికల సిబ్బంది

న్యూస్‌రీల్

నేడు వేతనంతో కూడిన సెలవు
నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 30 గురువారం జిల్లాలో మూడు నియోజకవర్గాల పరిధిలోని దుకాణాలు, ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు వేతనంతో కూడిన సెలవు ప్రకటించారు. ఈమేరకు చీఫ్ ఇన్‌స్పెక్టర్, కార్మిక కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. సహాయ కార్మిక అధికారి సాయిబాబా ఉత్తర్వులు జారీ చేశారు.

ఖానాపూర్‌లో రెండు మోడల్ పోలింగ్ కేంద్రాలు



ఖానాపూర్: ఓటర్లను ఆకర్షించి పోలింగ్ శాతం పెంపొందించేందుకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఖానాపూర్ మండలంలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని 241వ పోలింగ్ బూత్‌తోపాటు తర్లపాడ్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోని 213వ పోలింగ్ బూత్‌లను మోడల్ పోలింగ్ కేంద్రాలుగా తీర్చిదిద్దారు.

‘ప్రజల పాలనకు ఓటేయండి’
ఖానాపూర్: తొమ్మిదేళ్ల కేసీఆర్ నియంతపాలనలో పోలీసురాజ్యం పోవాలని, ప్రజల పాలన రావాలని ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్ అన్నారు. పట్టణంలో బుధవారం మాట్లాడారు. నిరుద్యోగులు, పేదలు, ఉద్యోగులతోపాటు అన్నివర్గాలను మోసం చేసి వేలకోట్లు సంపాదించుకున్న కేసీఆర్ పాలనకు చరమగీతం పాడాలని కోరారు. దళిత, గిరిజన, మైనార్టీలను మోసం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. బీఆర్‌ఎస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలని విన్నవించారు.

ఎన్నికలకు భారీ బందోబస్తు

- ఎస్పీ ప్రవీణ్ కుమార్



డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద ఎస్పీ ప్రవీణ్‌కుమార్

నిర్మల్‌టౌన్: అసెంబ్లీ ఎన్నికలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సామస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియం, ముధోల్‌లోని టీఎస్ డబ్ల్యూఆర్‌జేపీ ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి సెక్టార్ అధికారులు, పోలీస్ రూట్ మొబైల్ అధికారులతో పోలింగ్ అధికారులను, పోలింగ్ పరికరాలను పోలింగ్ లొకేషన్లకు బుధవారం పటిష్టమైన భద్రతతో తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. పోలీస్ అధికారులకు, సిబ్బందికి, బందోబస్త్, భద్రతపై సూచనలు చేసినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 519 పోలింగ్ లొకేషన్లు, 743 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వీటిలో సాధారణ, కొన్ని సామస్యాత్మకంగా పోలింగ్ కేంద్రాలుగా విభజించామని, దానికి అనుగుణంగా భద్రత చర్యలు చేపట్టామన్నారు. ఎన్నికలకు ఎలాంటి ఆటంకం కలుగకుండా ప్రత్యేకమైన యాక్షన్ ప్లాన్ రూపొందించామన్నారు. పోలింగ్ కేంద్రాల చుట్టూ మూడంచెల భద్రత ఉంటుందని తెలిపారు. మారుమూల గ్రామాలకు ఈవీఎంల తరలింపులో ఆటంకం కలుగకుండా పెట్రోలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రత్యేక స్ట్రైకింగ్ ఫోర్స్‌ను టీంలుగా విభజించామని, ఏదైనా సంఘటన సంభవిస్తే దానిని ప్రతిఘటించేలా క్విక్ రియాక్షన్ టీం ఏర్పాటు చేశామని వివరించారు. ఎస్పీ వెంట పట్టణ సీఐ పురుషోత్తం, ట్రాఫిక్ ఎస్సై దేవేందర్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఉన్నారు.

మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లో బాంబుస్క్వాడ్ తనిఖీలు



తనిఖీలు చేస్తున్న బాంబుస్క్వాడ్

ఖానాపూర్: మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాలైన మండలంలోని సింగాపూర్, రాజూరా, బావాపూర్(ఆర్)తో పాటు పలు గ్రామాల్లో బాంబుస్క్వాడ్ బృందం బుధవారం ముమ్మర తనిఖీలు చేపట్టింది. ఆయా గ్రామాలకు వెళ్లే మార్గమధ్యంలోని కల్వర్టులను తనిఖీ చేశారు. తర్వాత పోలింగ్ కేంద్రాలు, వాటి పరసరాలను తనిఖీ చేశారు. అనుమానాస్పద వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఉదయం పోలింగ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాంబు స్క్వాడ్ అధికారులు, సిబ్బంది ఈశ్వర్‌సింగ్, రాజు, బానుప్రసాద్, గంగన్న, తదితరులు తనిఖీలు చేశారు.

అంతుచిక్కని ఓటరు నాడి

- ఎవరి మనసులో ఏముందో?
- అభ్యర్థుల అంతర్మథనం

నిర్మల్ ఖిల్లా: ఎన్నికల ప్రచార పర్వం ముగిసింది. ఎన్నికల్లో తొలి ఘట్టం నామినేషన్ల పర్వం నుంచి ప్రధాన పార్టీల అభ్యర్థులతోపాటు ఇతర పార్టీలు, ఇండిపెండెంట్ అభ్యర్థులు కూడా హోరాహోరీ ప్ర చారం చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఊరూరా తిరుగుతూ ప్రచారం చేశారు. రాత్రివేళ గ్రామాల్లో తమ పార్టీ పరిస్థితిపై అంచనా వేశారు. అయితే అన్ని పార్టీల ప్రచార సభలకు పెద్ద ఎత్తున జనం హాజరయ్యారు. దీంతో ఏ పార్టీకి ఓటర్ల మద్దతు ఉందో అర్థంకాని పరిస్థితి. పోల్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా ఎవరికి ఏమివ్వాలో అంతుచిక్కడం లేదంటున్నారు. ప్రజల మద్దతు తమకే ఉందని పైకి చెబుతున్నా అంతర్గతంగా పరిస్థితి మాత్రం సందిగ్ధంగానే ఉంది. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో కూడా ఇదే పరిస్థితులు ఉండడంతో బరిలో ఉన్న అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. అయితే తమ నియోజకవర్గాల్లోని ఆయా గ్రామాల వారీగా ఓటర్లు ఎటువైపు మద్దతు పలుకుతున్నారో, పోలింగ్ రోజు ఓటు ఎవరికి వేశారో తెలుసుకుని సమాచారం ఇవ్వాలని అనుచరులకు, మండల, గ్రామస్థాయి నాయకులకు సూచిస్తున్నారు.

గత పోలింగ్ నివేదికల ఆధారంగా..
గతంలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో గ్రామాల వారీగా ఎన్ని ఓట్లు వచ్చాయి, పోలింగ్ కేంద్రం వారీగా ఎంత శాతం తమ పార్టీకి ఓటుషేర్ వచ్చింది, ప్రస్తుతం పార్టీ అభ్యర్థి పరిస్థితి ప్రజల్లో ఏవిధంగా ఉంది అనే వివరాల ఆధారంగా అంచనాలు వేస్తున్నారు. ఏయే పోలింగ్ కేంద్రాల పరిధిలో పార్టీ బలహీనంగా ఉందో లెక్కలు వేస్తున్నారు. క్షేత్రస్థాయిలో వార్డులు, గ్రామాల వారీగా బలాబలాలు అంచనా వేసుకుంటున్నారు.

జంపింగ్‌లతో కలవరం..
గురువారం ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. పార్టీలు మారిన నేతలతో ఎంతమంది వెళ్లారు. వారి ప్రభావం నియోజవర్గంలో ఎంతమేరకు ఉంటుంది. ఓట్ల పోలరైజేషన్ ఎలా జరుగుతుంది అని కూడా లెక్కలు వేసుకుంటున్నారు. ఇక తమ పార్టీలో చేరిన వారితో ఎంతమేరకు లబ్ధి చేకూరుతుందని కూడా అంచనాలు వేసుకుంటున్నారు. పకడ్బందీ ప్రణాళికతో ముందుకెళ్తున్న తరుణంలోనే ప్రధాన కార్యకర్తలు పార్టీలు మారడం కూడా పోల్ మేనేజ్‌మెంట్‌కు ఆటంకంగా మారింది. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఓటరు మనసులో ఏ ముందో మాత్రం అంతుచిక్కడం లేదని ప్రధాన పార్టీల అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.



క్లుప్తంగా

ప్రమాదవశాత్తు కిరాణా దుకాణం దగ్ధం



దుకాణంలో దగ్ధమైన సామగ్రి

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని మదీనా కిరాణా దుకాణంలో బుధవారం ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించింది. దుకాణ యజమాని మోహినొద్దీన్ తెలిపిన వివరాల మేరకు ఉదయం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు దుకాణం నుంచి పొగలు రావడాన్ని గమనించి సమాచారం అందించారు. వెంటనే వెళ్లి దుకాణం తెరిచి చూడగా అప్పటికే రూ.5 లక్షల విలువైన కిరాణా సామాగ్రి, రూ.75 వేల నగదు కాలి బూడిదయ్యాయి. అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదని యజమాని పేర్కొన్నారు.

నగదు స్వాధీనం

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): మండల కేంద్రంలోని శాంతినగర్ కాలనీలో కామెరి రాజు వద్ద నుంచి రూ.83 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మనోహర్ తెలిపారు. మంగళవారం రాత్రి ఒంటి గంటకు శాంతినగర్ కాలనీలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా తమకు అందిన సమాచారం మేరకు కామెరి రాజును తనిఖీ చేయగా ఎలాంటి ఆధారాలులేని రూ.83 వేల నగదు లభ్యమయ్యాయన్నారు. నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

జైనథ్: మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై పురుషోత్తం తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన భౌనే భూపాల్ (42) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జీవితంపై విరక్తితోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుని భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గంజాయి పట్టివేత



గంజాయితో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

జైనూర్: రూ.3.50లక్షల విలువైన గంజాయి పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్, జైనూర్ ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. మండల కేంద్రానికి చెందిన షేక్ రహీం, కెరమెరి మండలానికి చెందిన షేక్ మహితాబ్ మహారాష్ట్రలో రూ.3.50లక్షల విలువైన 14 కిలోల గంజాయి కొనుగోలు చేసి కర్ణాటక రాష్ట్రానికి తరలించడానికి సిద్ధంగా ఉంచగా పట్టుకుని కేసు నమోదు చేశారు.

ఆ పోలింగ్ కేంద్రాలపై డేగ కన్ను!

- ఎన్నికలు బహిష్కరించాలంటూ 'మావో'ల లేఖలు
- వామపక్ష ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి
- తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో కేంద్ర బలగాలు
- 13 నియోజకవర్గాల్లో గంట ముందే పోలింగ్ నిలిపివేత



మంచిర్యాల జిల్లా వేమనపల్లిలో రామగుండం సీపీ రెమా రాజేశ్వరి, డీసీపీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: వామపక్ష వాదంతో ప్రభావితమైన పోలింగ్ కేంద్రాలపై భద్రతా బలగాలు ప్రత్యేక దృష్టి సారించాయి. రాష్ట్రంలో మావోయిస్టుల కార్యకలాపాలు చాలా వరకు తగ్గిపోయాయి. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దుల్లో అప్పుడప్పుడు దాడులు, ఎన్‌కౌంటర్లు జరుగుతున్నా అంతర్రాష్ట్ర సరిహద్దులకే పరిమితం అవుతున్నాయి. తెలంగాణ భూ భాగంలో చూస్తే చివరగా, 2020సెప్టెంబర్‌లో కాగజ్‌నగర్ అడవుల్లో ఇద్దరు మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు. ఆ తర్వాత ఇలాంటి ఘటనలు జరగలేదు. మారిన పరిస్థితులతో క్రమంగా పోలీసు భద్రత పెరగడం, రోడ్లు, వంతెనల రాకతో అటవీ సమీప ప్రాంతాల పోలింగ్ కేంద్రాల్లోనూ వసతులు కలుగుతున్నాయి. 2018ఎన్నికల్లో వామపక్ష ప్రభావిత ప్రాంత పోలింగ్ కేంద్రాల్లో చాలా చోట్ల 70శాతానికి పైగా ఓటింగ్ జరగడం గమనార్హం

భారీగా బందోబస్తు

రాష్ట్ర వ్యాప్తంగా 119స్థానాల్లోని 28శాసనసభ నియోజకవర్గాల్లో 614పోలింగ్ కేంద్రాలు వామపక్ష ప్రభావం ఉన్నట్లు గుర్తించారు. ఇప్పటికే మూడు దఫాలుగా పోలింగ్ ముందు, పోలింగ్ రోజు, పోలింగ్ తర్వాత చేపట్టాల్సిన బందోబస్తుపై ప్రత్యేక ప్రణాళికతో ఉన్నారు. ఓటింగ్ రోజు పక్కాగా 144సెక్షన్ అమలు, పోలింగ్ తర్వాత చీకటి పడకముందే ఈవీఎంలను భద్రంగా స్ట్రాంగ్ రూంకు తరలించడం, సిబ్బందికి ఎలాంటి ఘటనలు ఎదురుకాకుండా రక్షణ కల్పించనున్నారు. ఈ క్రమంలో



మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దుల్లో డ్రోన్ పెట్రోలింగ్

రాష్ట్రంలో 13నియోజకవర్గాల్లో గంట ముందే పోలింగ్ ముగించనున్నారు. మిగతా చోట్ల ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటే, ఇక్కడ మాత్రం నాలుగు గంటల వరకు క్యూలో ఉన్నవారికే ఓటేసే అవకాశం ఉంటుంది. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో భౌగోళిక ఇబ్బందులతో నెట్‌వర్క్ సిగ్నల్ లేకపోవడం, అటవీ, నదీ తీర ప్రాంతాలు, అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలు, గిరిజన గూడేలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సమస్యాత్మక కేంద్రాల్లో వెయ్యికి పైగా కేంద్ర, పారామిలిటరీ, 7500సాయుధ బలగాలు రాష్ట్రాల సరిహద్దుల్లో విధుల్లో ఉన్నారు. బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, సమస్త సీమ బల్, జార్ఖండ్ ఆర్మూర్ బెటాలియన్ బలగాలతోపాటు స్థానిక పోలీసులతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. డ్రోన్ కెమెరాలతో పెట్రోలింగ్ చేస్తున్నారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఏపీ సరిహద్దులు, ఒడిశా వైపు నుంచి వచ్చే వారిపై నిఘా కొనసాగుతోంది.

'మావో'ల హెచ్చరిక లేఖలు

కేంద్ర, రాష్ట్ర అధికార, విపక్ష పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థుల పేర్లతో సహా నియోజకవర్గాల్లో మావోయిస్టు పార్టీ నుంచి హెచ్చరిక లేఖలు విడుదల అవుతున్నాయి. బూటకపు ఎన్నికలు బహిష్కరించాలని ప్రజలకు పిలుపునిస్తున్నారు. సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లోనూ కోల్‌కమిటీ పేరుతో ప్రకటనలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉంటూ ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు కృషి జరుగుతోంది. రాష్ట్రంలో కొత్తగూడెం, ములుగు జిల్లాలో అత్యధికంగా వామపక్ష ప్రభావ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

జిల్లా	నియోజకవర్గాలు	వామపక్ష ప్రభావిత పోలింగ్ కేంద్రాలు
మంచిర్యాల, పెద్దపల్లి	09	46
ఆసిఫాబాద్	02	61
ఆదిలాబాద్	04	44
నిర్మల్	01	17

భైంసాలో అర్ధరాత్రి సోదాల కలకలం

- బీజేపీ అభ్యర్థి బంధువు ఇంటిని చుట్టుముట్టిన పోలీసులు
- కార్యకర్తలు, పోలీసులకు మధ్య ఘర్షణ
- పలు వాహనాల అద్దాలు ధ్వంసం, పలువురికి గాయాలు



కార్యకర్తను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

భైంసాటౌన్(ముధోల్): భైంసా పట్టణంలోని బీజేపీ అభ్యర్థి బంధువు ఇంట్లో మంగళవారం అర్ధరాత్రి పోలీసులు, ఎన్నికల నిఘా విభాగం అధికారులు జరిపిన సోదాలతో ఆ ప్రాంతంలో కలకలం రేగింది. స్థానిక వినాయక్‌నగర్‌లో బీజేపీ అభ్యర్థి పవార్ రామారావుపటేల్ సమీప బంధువు ఇంట్లో అనుమానాస్పదంగా సమావేశమయ్యారన్న ఫ్లయింగ్ స్క్వాడ్ టీం సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని సోదాలకు యత్నించారు. ఆ సమయంలో ఇంట్లో కుటుంబ పెద్ద లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఆయనకు సమాచారమిచ్చారు. దీంతో ఆయన పార్టీ కార్యకర్తలతో ఇంటికి చేరుకోగా పోలీసులు, కార్యకర్తలకు మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. పరిస్థితులను అదుపులోకి తెచ్చే క్రమంలో తోపులాట, ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. పలు వాహనాల అద్దాలు ధ్వంసమయ్యాయి. పోలీసు బలగాలు భారీగా మోహరించడంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కాగా అర్ధరాత్రి సమయంలో మాస్క్, రెయిన్‌కోట్ ధరించిన కొందరు ప్రహరీ దూకి ఇంటి ఆవరణలోకి వచ్చి తలుపులు బాదడంతో భయపడ్డామని సదరు ఇంట్లో ఉన్న మహిళలు ఆరోపించారు. సోదాలకు సంబంధించి ఎలాంటి ఆధారపత్రాలు చూపకుండానే పోలీసులు ఇంట్లో చొరబడ్డారని కుటుంబ సభ్యులు ఆరోపించారు.

ఎస్ఎఫ్‌టీ సమాచారం మేరకే : ఏఎస్పీ

ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా సదరు ఇంట్లో అనుమానాస్పదంగా సమావేశమయ్యారన్న ఎస్ఎఫ్‌టీ సమాచారం మేరకు వారి ఇంటికి చేరుకుని సోదాలు నిర్వహించినట్లు ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపారు. ఇంట్లో కుటుంబ యజమాని లేకపోవడంతో ఆయన వచ్చే వరకు వేచి చూసి సోదాలు నిర్వహించామన్నారు. పోలీసు అధికారులు, సిబ్బందిపై కార్యకర్తలు చేయి చేసుకోవడంతో పాటు వాహనాలను ధ్వంసం చేశారన్నారు. దీంతో మరింత పోలీసు బందోబస్తుతో వెళ్లి ముఖ్య నాయకులతో పాటు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. జరిగిన సంఘటనపై సీసీ ఫుటేజీ, ఇతర అన్ని కోణాల్లో పరిశీలించి దర్యాప్తు చేస్తామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చట్టపరంగా కఠిన శిక్షలు తీసుకుంటామన్నారు. పోలీసు విధులకు ఆటంకం కలిగిస్తే సహించేది లేదని, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

2న జోనల్ స్థాయి క్రికెట్ పోటీలు

ఆదిలాబాద్: జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో డిసెంబరు 2న జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఉమ్మడి జిల్లా అండర్ –17 బాలుర విభాగంలో జోనల్ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు తమ సొంత ప్లేయింగ్ కిట్లతో పాటు నాలుగు సెట్ల అర్హత ధ్రువపత్రాలు పూర్తి చేసుకుని వెంట తీసుకు రావాలన్నారు. పోటీలకు హాజరయ్యే ఉమ్మడి జిల్లాలోని క్రీడాకారులు ఉదయం 9 గంటలకు స్టేడియంలో రిపోర్టు చేయాలని సూచించారు.

చీరెలు, మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న దేశీదారు బాటిళ్లు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కటిక దుకాణాల వద్ద, ఇతర కార్మిక వాడల్లో ఓటర్లకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచిన మద్యం బాటిళ్లు, చీరెలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం (ఎఫ్ఎస్‌టీ) బుధవారం పట్టుకుంది. ఒక ఇంట్లో 41, మరో ఇంట్లో 15 మద్యం బాటిళ్లను ఎఫ్ఎస్‌టీ సభ్యులు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు మరో ఇంట్లో 110 చీరెలను ఎఫ్ఎస్‌టీ బృందం పట్టుకుని సీజ్ చేసింది.

నస్పూర్ పట్టణ పరిధిలో..

నస్పూర్: పట్టణ పరిధిలోని సీసీసీ కార్నర్ ఎస్బీఐ సమీపంలో వాహన తనిఖీ సమయంలో ఓ వ్యక్తి బైక్‌పై తీసుకువెళ్తున్న 197 చీరెలను ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది బుధవారం పట్టుకున్నారు. ఎలాంటి ఆధారం చూపకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

ఆదిలాబాద్‌టౌన్: అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టుకున్నట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని విద్యానగర్ ప్రాంతంలో బుధవారం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో విద్యానగర్‌కు చెందిన సుధీర్ అనే వ్యక్తి 217 మద్యం బాటిళ్లు తరలిస్తుండగా పట్టుకున్నారు. వాటి విలువ రూ.70 వేలు ఉంటుందని వివరించారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

దేశీదారు పట్టివేత

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒడ్డెర కాలనీలో బుధవారం రాత్రి సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సాయినాథ్ సమాచారం మేరకు సోదాలు నిర్వహించారు. ఇందులో భాగంగా మంజరి గోపాల్ వద్ద సుమారు రూ.3వేల విలువ చేసే 27 దేశీదారు బాటిళ్లను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం టుటౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు.

అశ్వవాహనంపై స్వామివారి ఊరేగింపు



స్వామి వారిని ఊరేగిస్తున్న భక్తులు

జైనథ్: మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో బుధవారం రాత్రి అశ్వరథోత్సవం నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను అశ్వ వాహనంపై ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, రాత్రి స్వామి వారికి అభిషేకాలు గావించారు. రాత్రి వేళ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను అశ్వ వాహనంలో ప్రతిష్ఠించి, భక్తుల దర్శనార్థం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలను పంపిణీ చేసారు.

రూ.45లక్షలు లాక్కెళ్లిన దుండగులు

- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

కాగజ్‌నగర్‌టౌన్: కారులోంచి రూ.45లక్షలను దుండగులు లాక్కెళ్లిన ఘటన బుధవారం కాగజ్‌నగర్ పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో చోటుచేసుకుంది. వివరాలు.. పట్టణంలోని ఈద్గా కాలనీకి చెందిన ఎస్ఆర్‌పీ సత్యనారాయణ మంగళవారం రాత్రి 11గంటల ప్రాంతంలో పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో తన కారు నిలిపాడు. ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు అక్కడకు వచ్చి సత్యనారాయణను తోసిసి కారు వెనుకభాగంలో ఉంచిన రూ.45లక్షలు ఎత్తుకెళ్లారు. దీంతో బాధితుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్‌హెచ్‌వో బీ స్వామి తెలిపారు.

ఎవరికీ పట్టని సరిహద్దు గ్రామాలు



లేండిగూడలో నిరుపయోగంగా వాటర్‌ట్యాంక్



కంకర తేలిన పరందోలి రోడ్డు

- రెండు రాష్ట్రాల్లో పాలనలో ఇక్కట్లపాలు
- నేడు ఓటేయనున్న 3,383 మంది ఓటర్లు
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

కెరమెరి(ఆసిఫాబాద్): ఇటు తెలంగాణ.. అటు మహారాష్ట్ర.. ఈ రెండు ప్రభుత్వాలు సరిహద్దులో ఉన్న కెరమెరి మండలంలోని 14 వివాదాస్పద గ్రామాలను ఏళ్లతరబడి పాలిస్తున్నాయి. కానీ.. ఏ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో గ్రామాల్లో ప్రధాన సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఎన్నికలప్పుడే వచ్చే నేతలు హామీలు ఇచ్చి ఆ తర్వాత పట్టించుకోవడంలేదని ఈ గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. గురువారం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తుండగా 14 గ్రామాల్లో నివసించే 3,383 ఓటర్లు ఓటు వినియోగించుకోనున్నారు. పరంధోళి పంచాయతీ పరిధిలో పరంధోళి, కోటా, పరంధోళి తండా, శంకర్‌లొద్ది, లేండిజాల, ముకద్దంగూడ పరిధిలో మహరాజ్‌గూడ, ముకదంగూడ, అంతాపూర్ పరిధిలో అంతాపూర్, ఇంద్రానగర్, పద్మావతి, ఏసాపూర్, నారాయణగూడ, భోలాపటార్ పరిధిలో భోలాపటార్, లేండిగూడ, గౌరీ గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లో సుమారు 1,520 కుటుంబాలుండగా.. 5,875 జనాభా ఉంది. కాగా, ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పోలింగ్ శాతం పెరిగేనా...!

- 2014లో 73.49 శాతం పోలింగ్
- 2018లో 83.34 శాతంగా నమోదు
- స్వీప్ ద్వారా ఓటు వినియోగంపై విస్తృత ప్రచారం



కైలాస్‌నగర్: ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటూ కీలకమే. అభ్యర్థుల తల రాతలను మార్చగలిగే శక్తి ఒక్క ఓటు అనే ఆయుధానికే మాత్రమే ఉంది. అంతటి కీలకమైన ఓటు హక్కు వినియోగంపై ఎన్నికల సంఘం, జిల్లా అధికార యంత్రాంగం విస్తృత ప్రచారం కల్పిస్తున్నా ఇప్పటికీ చాలా మంది అంతగా ఆసక్తి చూపడం లేదు. ఓటు వినియోగంలో పట్టణ ప్రాంతాల ప్రజల కంటే గ్రామీణులే ముందుండడం విస్మయానికి గురి చేస్తోంది. గడిచిన రెండు అసెంబ్లీ ఎన్నికల్లో తక్కువ పోలింగ్ శాతం నమోదైన పట్టణ ప్రాంతాల్లో ఈ సారి పోలింగ్ శాతాన్ని పెంచాలని భావించిన జిల్లా అధికార యంత్రాంగం స్వీప్ ద్వారా విస్తృత అవగాహన కార్యక్రమాలను చేపట్టింది. కొన్ని ప్రాంతాల్లో ఓటర్లకు బొట్టుపెట్టి మరీ ఓటేయాలని విజ్ఞప్తి చేసింది. ఈ నేపథ్యంలో పోలింగ్‌శాతం గత ఎన్నికల కంటే పెరుగుతుందా అనే చర్చ సాగుతోంది. అయితే మూడు రోజులుగా మారిన వాతావరణ పరిస్థితులు పోలింగ్‌పై ప్రభావం చూపనున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జిల్లాలో 19,59,458 మంది ఓటర్లు

ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత 2014లో జరిగిన జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో 73.49 పోలింగ్ శాతం నమోదైంది. జిల్లాలో మొత్తం 19,59,458 మంది ఓటర్లు ఉండగా అందులో 14,40,231 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 7,21,308 మంది ఉండగా మహిళలు 7,18,920 మంది, ఇతరులు ఇద్దరు చొప్పున ఉన్నారు. మహిళలకంటే పురుషులే ఎక్కువ మంది తమ ఓటుహక్కు వినియోగించుకోవడం గమనార్హం. పురుషుల పోలింగ్ 73.54 శాతం నమోదు కాగా మహిళల పోలింగ్ 73.47 శాతం, ఇతరులు 0.99 శాతంగా నమోదైంది.

2018లో 9.85 శాతం పెరిగిన పోలింగ్

2014 ఎన్నికలతో పోల్చితే 2018లో జరిగిన ఎన్నికల్లో పోలింగ్ 9.85 శాతం పెరిగింది. జిల్లా వ్యాప్తంగా 83.34 పోలింగ్ నమోదైంది. ఆదిలాబాద్ నియోజకవర్గంలో 1,68,992 ఓట్లు పోలయ్యాయి. ఇందులో పురుషులు 84,934, మహిళలు 83,913 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. 81.64 శాతం పోలింగ్ నమోదైంది. బోథ్ నియోజకవర్గంలో 1,69,245 ఓట్లు పోలుకాగా 85.29 శాతం పోలింగ్ నమోదైంది. పురుషులు 84,398, మహిళలు 84,832 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పోలింగ్ శాతం పెంపునకు విస్తృత ప్రచారం

ఈ ఎన్నికల్లో పోలింగ్ శాతం మరింతగా పెంచేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు స్వీప్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. వృద్ధులు, దివ్యాంగులు, యువకులతో ప్రత్యేకంగా ర్యాలీలు నిర్వహించడంతో పాటు యువతులు, మహిళలకు రంగోలి పోటీలను ఏర్పాటు చేశారు. సాంస్కృతిక సారథి కళాకారుల ద్వారా చైతన్య కార్యక్రమాలను నిర్వహించారు. పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం తక్కువగా ఉన్న కాలనీలపై మరింతగా దృష్టి సారించి ఓటర్లకు బొట్టు పెట్టి మరీ ఓటు వేయాలని కోరారు. తల్లిదండ్రులు ఓటు వేసేలా చూడాలని కోరుతూ పాఠశాలల్లో చదివే తమ పిల్లల ద్వారా ఓటు హక్కు వినియోగ సంకల్ప పత్రాలను పంపించారు. జిల్లా అధికారులు సైతం ప్రతీ ఓటరు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలంటూ పదేపదే విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో పోలింగ్ శాతం ఏ మేరకు పెరగనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే గడిచిన మూడు రోజులుగా జిల్లాలో వాతావరణ పరిస్థితులు మారాయి. వర్షాలు కురుస్తుండడంతో పాటు చలి వణికిస్తోంది. దీంతో వృద్ధులు, అనారోగ్యానికి గురైన వారు ఓటేసేందుకు ఏ మేరకు ముందుకు వస్తారనేది సందేహంగా మారింది. ఇదీ పోలింగ్‌పై ప్రభావం చూపే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఓటుహక్కు వినియోగించుకోవాలి

పోలింగ్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం లేకుండా కేంద్రాల్లో వసతులు కల్పించాం. ఓటర్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవాలి. ప్రజాస్వామ్యంలో తమకు నచ్చిన నేతలను ఎన్నుకునేందుకు ఓటే ఆయుధం. దీన్ని గుర్తించి ప్రతీ ఓటరు పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయాలి. ఓటు వేసేందుకు ప్రజలు ఎంతో ఆసక్తి చూపుతున్నారు. అందుకు జిల్లాలో నమోదైన పోస్టల్ బ్యాలెట్ వినియోగమే నిదర్శనం.

– రాహుల్ రాజ్, కలెక్టర్, ఆదిలాబాద్

ఓటేసేందుకు వెళ్తున్నారా..!

- ఏదైనా ఒక కార్డు తప్పనిసరి

కై లాస్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు ఎదైనా ఒక గుర్తింపు కార్డును అధికారులకు తప్పనిసరిగా చూపించాల్సి ఉంటుందని ఎన్నికల సంఘం నిర్దేశించింది. అధికార యంత్రాంగం జారీ చేసిన పోల్ చీటీలు కేవలం పోలింగ్ కేంద్రాలు, ఓటర్లకు సంబంధించి సమాచారాన్ని తెలిపేందుకు మాత్రమే తోడ్పడుతాయని స్పష్టం చేశారు.

ఈసీ నిర్దేశించిన కార్డులు

- ఓటరు గుర్తింపు కార్డు
- ఆధార్ కార్డు
- ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డు
- బ్యాంకు పాస్‌బుక్
- హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్‌కార్డు
- డ్రైవింగ్ లైసెన్స్
- పాన్‌కార్డు
- పాస్‌పోర్ట్
- ఫొటోతో కూడిన పెన్షన్ డాక్యుమెంట్
- సర్వీస్ ఐడీ కార్డు
- వైకల్య ధృవీకరణ పత్రం
- కార్మిక శాఖ ద్వారా జారీచేసిన గుర్తింపు కార్డు
- ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు జారీచేసిన గుర్తింపు కార్డుల్లో ఎదైనా ఒకటి తప్పనిసరిగా తీసుకురావాలని అధికారులు సూచించారు. పోలింగ్ బూత్‌లోకి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబడవు.

బెల్లంపల్లిలో పోటాపోటీగా ప్రలోభాల పర్వం!



బెల్లంపల్లి: అసెంబ్లీ ఎన్నికల ప్రచార పర్వం ముగియగా రెండు ప్రధాన పార్టీలకు చెందిన బెల్లంపల్లి అభ్యర్థులు పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి సారించారు. ప్రలోభాలకు తెరలేపి ఓటర్లకు ఎర వేస్తున్నారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకు డబ్బు, మద్యం పంపిణీ చేశారనే ఆరోపణలున్నాయి. ఓ అభ్యర్థి బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఓటుకు రూ.వెయ్యి చొప్పున, మరో అభ్యర్థి రూ.500 చొప్పున పంపిణీ చేసినట్లు సమాచారం. ముందుగా ఓటుకు రూ.500 మాత్రమే పంపిణీ చేసిన రెండో అభ్యర్థి కూడా తానేం తక్కువ కాదని ఆ తర్వాత మరో రూ.500 ఇచ్చినట్లు తెలిసింది. నగదుతోపాటు మద్యం బాటిళ్లు కూడా పంపిణీ చేసినట్లు సమాచారం. గ్రామాల్లోనూ ఈ అభ్యర్థులే ఓటుకు రూ.500 చొప్పున పంపిణీ చేసినట్లు తెలిసింది. కాగా, అభ్యర్థులు ప్రలోభాలకు తెరలేపి ఎలాంటి ఆటంకం లేకుండా ప్రక్రియ పూర్తి చేసినా ఎక్కడా అధికారులు నిలువరించిన దాఖలాలు లేకపోవడం గమనార్హం.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

మందమర్రిరూరల్: మందమర్రిలోని అంగడి బజార్‌కు చెందిన కొక్కెర మల్లమ్మ (60) బుధవారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లమ్మ ఉదయం వాటర్ హీటర్ వేసిన అనంతరం కొద్దిసేపటికి అనుకోకుండా దానిని పట్టుకోవడంతో షాక్‌కు గురై గురైంది. పనిమీద బయటకు వెళ్లిన ఆమె భర్త బీరయ్య కాసేపటికి ఇంటికి వచ్చి చూడగా విగతజీవిగా పడి ఉంది. మృతురాలికి భర్త ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

గూడెంలో భక్తుల సందడి



క్యూ లైన్‌లో నిల్చున్న భక్తులు

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో బుధవారం భక్తుల రద్దీ నెలకొంది. భక్తులు క్యూలైన్‌లో నిల్చుని సత్యదేవున్ని దర్శించుకుని మొక్కు తీర్చుకున్నారు. సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఆచరించారు. కార్తీక దీపాలు వెలిగించారు.